క్లుప్తంగా

చెరువులో తవ్వకంపై ఫిర్యాదు


తవ్విన కాలువను చూపిస్తున్న రైతులు

సాలూరు: మండలంలోని కూర్మరాజుపేట రెవెన్యూ పరిధిలో లక్ష్మీసాగరం చెరువులో నీరు నిల్వ ఉండకుండా ప్రభుత్వం నిర్మించిన చప్టాను స్థానిక భూస్వామి తవ్వించారని రైతులు ఆరోపించారు. ఈ మేరకు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు తవ్వకంపై రైతులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. చెరువులో నీరు ఉంటే తన భూమి ముంపునకు గురవుతుందని భావించి భూ యజమాని నీరు నిల్వ ఉండకుండా చెరువుకు సమాంతరంగా కాలువ తవ్వి చెరువు నీరు బయటకు వెళ్లేలా తవ్వేశారని చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో స్థానిక రైతులు జగన్నాథం, సూర్యనారాయణ, అప్పారావు, తవిటినాయుడు తదితరులు ఉన్నారు.

నేడు అవగాహన సదస్సు

పార్వతీపురం టౌన్: మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్టు రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు శుక్రవారం తెలిపారు. మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు రెండో అదనపు జిల్లా కోర్టు సమావేశ మందిరంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

అప్పయ్యపేటలో ఫ్యామిలీ డాక్టర్


రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శిరీష

సీతానగరం: ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా గ్రామాల్లో రోగులకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామని సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ శిరీష అన్నారు. అప్పయ్యపేటలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఇందులో సుమారు వంద మందికి శిరీష వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఎంపీటీసీ బి.కుసుమ ఆధ్వర్యంల జరిగిన కార్యక్రమంలో సచివాలయ కన్వీనరు బి.సూర్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది, 104 సిబ్బంది, ఆశ వర్కర్లు తమ సేవలు అందించారు.

రూ.82 లక్షలతో ఇంటింటికీ కుళాయిలు


నిడగల్లులో జరుగుతున్న ఇంటింటి కుళాయి పనులు

సీతానగరం: మండలంలోని నిడగల్లు గ్రామానికి జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటి కుళాయిల పనులు ప్రారంభమైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.పవన్‌కుమార్ తెలిపారు. సంబంధిత పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పెద్ద గ్రామమైన నిడగల్లుకు ప్రభుత్వం రూ. 82 లక్షలు నిధులు మంజూరు చేయడంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయని, గ్రామానికి 1100 ట్యాప్‌లు వేసేందుకు ట్రెంచ్ పనులు ప్రారంభించినట్టు తెలిపారు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని సూచించారు.

పిల్లలతో పనిచేయించడం నేరం


దుకాణంలో తనిఖీ చేస్తున్న జూనియర్ సివిల్ జడ్జి, తదితరులు

పాలకొండ: బడి ఈడు పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి విజయరాజ్‌కుమార్ హెచ్చరించారు. అంతర్జాతీయ బాలకార్మిక వ్యతిరేక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలతో పనిచేయించడం చట్టరీత్యా నేరమని అన్నారు. బడిఈడు పిల్లలను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఆయనతో పాటు కార్మికశాఖ అధికారి ఆర్‌వీ శ్రీనివాసరావు, సహాయ అధికారి కె.రామకృష్ణ, సోషల్ వర్కర్ మధు రమీనాక్షి, సీనియర్ న్యాయవాదులు ఉన్నారు.

'గడప గడప'లో సమస్యల పరిష్కారం

సంక్షేమ ఫలాలు అర్హులకు అందుతున్నదీ... లేనిదీ... తెలుసుకోవడం...ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్రంలో వినూత్నంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. సంక్షేమ ఫలాలు అందని లబ్ధిదారులను గుర్తించడం ద్వారా వారికీ న్యాయం చేయడం .. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడం ద్వారా పరిష్కరించే ఈ కార్యక్రమం ద్వారా పలు ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకుంటున్నాయి. దీంతో ఇటు లబ్ధిదారులతో పాటు అన్ని వర్గాల ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. సీతానగరం మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన ప్రజా సమస్యలు చాలా వరకు పరిష్కారమయ్యాయి. వాటి చిత్రాలే ఇవి. – సీతానగరం


చినంకలాం గ్రామానికి వేసిన బీటీ రోడ్డు


రేపటివలసలో నిర్మాణంలో ఉన్న బీటీ రోడ్డు


నిడగల్లులో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రారంభించిన ఆర్వో ప్లాంట్


లచ్చయ్యపేట ఎస్సీ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు

'అంగన్‌వాడీ'ల్లో టేక్ హోం కిట్ల పంపిణీ


పిల్లలకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ తేరేజమ్మ, ఎంపీటీసీ గౌరి

సీతానగరం: ప్రభుత్వం పిల్లల్లో రక్తహీన నివారణకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని పెదబోగిలి మేజరు పంచాయతీ సర్పంచ్ జె.తేరేజమ్మ, ఎంపీటీసీ ఎస్.గౌరి అన్నారు. పెదబోగిలి మేజరు పంచాయతీ పరిధిలో ఉన్న బుడ్డిపేట, పెదబోగిల, సీతానగరం, అప్పయ్యపేట గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న 14 నుండి 18 సంవత్సరాల మధ్య వయసు కలిగిన పిల్లలకు పౌష్టికాహారం కిట్‌లను అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్కువ మంది పిల్లలు రక్తహీనత కారణంగా తరచూ మృత్యువాత పడుతున్నారని వైద్యారోగ్య శాఖ నిర్వహించిన సర్వేలో వెల్లడి కావడంతో ప్రభుత్వం బృహత్తరమైన కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలని, ప్రభుత్వం సమకూర్చిన పౌష్టికాహార కిట్లను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ వెంకటరావు, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు. కొత్తవలస గ్రామంలో పిల్లలకు పౌష్టికాహార కిట్లను అంగన్‌వాడీలు అందజేశారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించండి

రేగిడి: మూడు సంవత్సరాల వయసు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని రేగిడి సెక్టార్ సూపర్‌వైజర్ శశికళ సూచించారు. ఆర్.ఆమదాలవలస అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. అనంతరం తల్లిదండ్రులతో సమావేశమై మాట్లాడారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మంచి పోషకాలు కలిగిన ఆహారాన్ని అందిస్తోందని, వాటిని తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను బాధ్యతగా అంగన్‌వాడీ కేంద్రాలకు తీసుకువెళ్లాలని కోరారు. కార్యక్రమంలో కార్యకర్తలు కె.రమణమ్మ, టి.రాములమ్మ, మేరీ, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

అర్చకులకు గౌరవ వేతనం మంజూరు

బొబ్బిలి: టీటీడీ, సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార గ్రామాల్లో నిర్మించిన ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు గౌరవ వేతనం (రూ. 5 వేలు చొప్పున) మంజూరైందని సమరసతా సేవా ఫౌండేషన్ డివిజన్ ధర్మ ప్రచారకుడు ధూపం వాసు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ఉమ్మడి జిల్లాలో 27 ఆలయాలను నిర్మించామని, అర్చకుల బ్యాంక్ ఖాతాలకు వచ్చే నెల నుంచి గౌరవ వేతనం జమవుతుందని చెప్పారు.

చెడు అలవాట్లతో భవిష్యత్ అంధకారం

రాజాం సిటీ: విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసలై జీవితాన్ని అంధకారం చేసుకోవద్దని ఎస్సై పి.నీలావతి అన్నారు. స్థానిక జీసీఎస్‌ఆర్ కళాశాలలో శుక్రవారం మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థి దశ జీవితంలో ఓ తీపిగుర్తుగా ఉండాలని, కానీ చెడు అలవాట్లకు లోనై జీవితాన్ని పాడుచేసుకోవద్దని సూచించారు. బాగా చదువుకుని తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.పురుషోత్తమరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి

రాజాం: పారిశుద్ధ్య పనులు చేసే సమయంలో కార్మికులు తగిన జాగ్రత్తలు పాటించాలని పూణేకు చెందిన కేఏం ఫౌండేషన్ రిసోర్సుపర్సన్లు కృష్ణ, చిన్నికృష్ణ, మితాసింగ్‌రాయ్ సూచించారు. పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపం వద్ద జీఎంఆర్ వీఎఫ్ ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పనులు చేసే సమయంలో చేతులకు గ్లౌజులు వేసుకోవడం, మాస్కులు ధరించడం చేయాలని, ప్రతీ నెల ఆరోగ్య తనిఖీలు చేయించుకోవాలని, వ్యాధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా వెంటనే చికిత్స తీసుకోవాలని సూచించారు. మురుగుకాలువల్లో చెత్త తొలగించే సమయంలో మెళకువలు పాటించాలని, సరైన రక్షణ లేకుండా డ్రైనేజీలో దిగరాదని హెచ్చరించారు.


పారిశుద్ధ్య కార్మికులకు శానిటేషన్ కిట్లు అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

అనంతరం కార్మికులకు శానిటేషన్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో జీఎంఆర్‌వీఎఫ్ జనరల్ మేనేజర్ కె.జయకుమార్, ప్రతినిధులు కె.శివమోహన్, ఆర్.అప్పలనాయుడు, ఎల్.రాజు, పి.జనార్దనరావు, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సమన్యాయం


మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

- ఇదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ అజెండా
- మేనిఫెస్టోను కచ్చితంగా అమలు చేస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం: అర్హతే కొలమానంగా అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేయడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అజెండా అని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని చిట్టపులివలస గ్రామంలో శుక్రవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఉన్న సుమారు 300 గడపలకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను, ఈ నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. వారి సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారమై సంబంధిత అధికారులతో మాట్లాడారు. 2019 ఎన్నికల ముందు ప్రకటించిన మేనిఫెస్టోను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 99 శాతం పైగా అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. రాష్ట్రంలో సొంతిల్లు లేని పేదలు ఉండరాదనే ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అర్హత ఉన్న పేదలకు సెంటు స్థలంతో పాటు ఇల్లు కట్టుకునేందుకు అవసరమైన ఆర్థిక సాయం అందిస్తున్నారని గుర్తుచేశారు. గతంలో పేదలకు సెంటు భూమి కూడా ఇవ్వలేని ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు పేదలకు ఇస్తున్న ఈ స్థలాలను శ్మశాన వాటికలతో పోల్చడం సరికాదన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో మధ్యవర్తులు లేకుండా నేరుగా ప్రజలకే సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. ముఖ్యంగా ఈ ప్రాంత రైతుల చిరకాల వాంఛ తోటపల్లి కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. అలాగే రూ.24.5 కోట్లతో చేపట్టిన కిమ్మి–రుషింగి వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. త్వరలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా ఈ వంతెనను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ప్రజల మనసులు గెలిచిన సీఎం జగన్‌కు ప్రజల కష్టాలు కూడా తెలుసునని, అందుకే అడగక ముందే ప్రతీ ఇంటి ముంగిటకు ప్రభుత్వ పథకాలు చేరుతున్నాయన్నారు. ప్రజలకు సుపరిపాలన అందించడంలో ఆయన తండ్రిని మించిన తనయుడిగా ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. ఈ సందర్భంగా చిట్టపులివలస గ్రామ రహదారిని అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరగా.. త్వరలోనే చర్యలు చేపడతామని ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కర్రి లీలాప్రసాదరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కర్రి గోవిందరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు రంభ శ్రీనివాసరావు, సొంట్యాన సింహాచలం, డోకల శ్రీను, మాచర్ల వెంకటరమణ, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు విక్రమపురంలో..

వీరఘట్టం: మండలంలోని విక్రమపురం గ్రామంలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పాల్గొంటారని పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు విక్రమపురం గ్రామానికి సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు. అలాగే సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు తమ వద్ద ఉన్న సమాచారంతో సిద్ధంగా ఉండాలన్నారు.

అందరి భాగస్వామ్యంతోనే 'జగనన్న సురక్ష'


సాలూరు: మున్సిపల్ కార్యాలయంలో కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

సీతానగరం: మండలంలో త్వరలో నిర్వహించనున్న జగనన్న సురక్ష పథకం అమల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి అర్హులైన వారి సమస్యలు పరిష్కరించడానికి కృషి చేయాలని ఎంపీపీ బి.రవణమ్మ, ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులు, ప్రజాప్రతినిధులకు శుక్రవారం దిశ నిర్దేశం చేశారు. ఎంపీపీ బి.రవణమ్మ పెదంకలాం సచివాలయం, ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, రెవెన్యూ అధికారులు ఎంపీడీఓ కార్యాలయంలో, ఏఓ ఎస్.అవినాష్ సిబ్బందితో ఆర్బీకేలో దీన్ని తిలకించారు. అనంతరం ఎంపీపీ రవణమ్మ, ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ఇప్పటికే 95 శాతం మంది ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం జరిగిందిందన్నారు. పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్‌లు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

సాలూరులో...

సాలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం లాంఛనంగా ప్రారంభించగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, సచివాలయ మున్సిపల్ కన్వీనర్ గిరి రఘు, కౌన్సిలర్లు ఇక్కడ నుంచి వీక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శంకరరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. మున్సిపాలిటీ, మండలంలో అన్ని సచివాలయాల్లో సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు తదితరులు ఈ లైవ్ కార్యక్రమంలో పాల్గొని ముఖ్యమంత్రి సందేశాన్ని విన్నారు.

బలిజిపేటలో...

బలిజిపేట: జగనన్న సురక్ష ప్రారంభ కార్యక్రమంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి సందేశాన్ని బలిజిపేట ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ నాగమణి, అధికారులు, నాయకులు విన్నారు. ఎంపీడీఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో టీవీ ద్వారా వీక్షించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మురళీకృష్ణ, మండల కన్వీనర్ శ్రీరాములునాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.


జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఎంపీడీఓ కార్యాలయంలో తిలకిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


బలిజిపేట: ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వీక్షిస్తున్న నాయకులు, అధికారులు

కాలువల నిర్మాణంలో జాప్యం తగదు

గరుగుబిల్లి: ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న తరుణంలో కాలువల నిర్మాణ పనుల్లో జాప్యం జరగడంపై రైతులు ఆందోళన చెందుతున్నారని మాజీ ఎంపీపీ ద్వారపురెడ్డి ధనుంజయరావు అన్నారు. సుంకి సమీపంలోని తోటపల్లి ప్రాజెక్టు కుడి కాలువ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. కుడి కాలువ నుంచి గరుగుబిల్లి, వంగర, బలిజిపేట మండలాల్లోని 10వేల ఎకరాలకు సాగునీరు సరఫరా జరుగుతుందన్నారు. కాలువ పరిధిలో నిర్మిస్తున్న రక్షణ గోడలు బలహీనంగా ఉండడంతో సాగునీరు సరఫరాపై రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. అధికారులు పనులను పూర్తిస్థాయిలో చేపట్టకుండా తాత్కాలిక ప్రాతిపదికన పనులను చేపట్టడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంక్రీటు పనులను త్వరితగతిన పూర్తిచేసి శివారు భూములకు సాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు.


కాలువ పనులను పరిశీలిస్తున్న మాజీ ఎంపీపీ ధనుంజయరావు

కూర్మావతారంలో జగన్నాథుడు

పాలకొండ: రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు కూర్మావతారంలో జగన్నాథస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షం కురుస్తున్నా.. స్వామిని దర్శించుకునేందుకు ఆలయం వద్ద భక్తులు బారులుతీరారు. ఆలయ అర్చకులు విశ్వనాథం దాస్, ఈఓ రాధాకృష్ణ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టారు. శనివారం హిరాపంచమిని పురస్కరించుకుని వేలాది మంది భక్తులు స్వామి దర్శనానికి వచ్చే అవకాశం ఉండడంతో అధికారులు ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. హిరపంచమి అనంతరం స్వామివారి తిరుగు రథయాత్ర ప్రారంభమవుతుంది



ఏఓగా అర్జునరావు బాధ్యతల స్వీకరణ

గరుగుబిల్లి: మండల పరిషత్ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా ఎస్.అర్జునరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఈయన ఇదే కార్యాలయంలో సీనియర్ సహాయకుడిగా పని చేస్తూ ఏఓగా ఉద్యోగోన్నతి పొందారు. జెడ్పీ చైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు చేతులమీదుగా ఉత్తర్వులను అందుకున్నారు. ఏఓగా ప్రమోషన్ పొందిన అర్జునరావుకు ఎంపీడీఓ జి.పైడితల్లి, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.


బాధ్యతలు స్వీకరించిన అర్జునరావుకు అభినందనలు తెలుపుతున్న సిబ్బంది

పనుల్లో జాప్యం తగదు

సంతకవిటి: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా మనబడి నాడు–నేడు కార్యక్రమం అమలు చేస్తున్నారని, అభివృద్ధి పనుల్లో జాప్యం తగదని జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జి.వి.రవికుమార్‌తో కలిసి ఎంఈఓలు, ఎస్ఎస్ఏ ఏఈ, హెచ్ఎంలు, సచివాలయ ఇంజినీర్లతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో జరుగుతున్న 'నాడు–నేడు' పనుల ప్రగతిపై ఆరా తీశారు. నిధులున్నా పనులు నత్తనడకన సాగుతుండడంతో అధికారుల అలసత్వంపై అసహనం వ్యక్తం చేశారు. హెచ్ఎంలు, సచివాలయ ఇంజినీర్లు సమన్వయంతో పని చేసి, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. పనుల్లో పురోగతి కనిపించేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఎస్ఏ ఏఈ దాలయ్యకు, ఎంఈఓలు బి.శాంతకుమారి, ఎంఈఓ–2 సీహెచ్.భాస్కరరావులకు సూచించారు.


సమీక్ష నిర్వహిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు